అంగరంగ వైభవం.. పాండురంగడి రథోత్సవం

- జనసందోహం నడుమ ముందుకు సాగిన రథం
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


రథోత్సవంలో పాల్గొన్న మంత్రి బీసీ, నేతలు


అలరించిన కాళికాశక్తి, భద్రకాళి, తదితర వేషధారణలు


రథోత్సవం వెంట చెక్కభజన



కోలాటం నిర్వహిస్తున్న మైదుకూరుకు చెందిన మహిళలు


జన సందోహం మధ్య పాండురంగడి రథోత్సవం

కోవెలకుంట్ల: పట్టణంలోని వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడి రథోత్సవం గురువారం అంగరంగ వైభవంగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు స్వామివారి రథోత్సవం కనుల పండువలా సాగింది. ముందుగా ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. మంగళవాయిద్యాలు, డ్రమ్స్, డప్పులతో అశేష జనవాహిని మధ్య రథోత్సవం ముందుకు కదిలింది. ఆలయం నుంచి రంగరాజుపేట, సంతమార్కెట్, అమ్మవారిశాల, గాంధీసెంటర్ వరకు రథోత్సోవాన్ని నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు పట్టణ ప్రజలే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో రథోత్సవ ప్రాంగణం కిటకిటలాడింది. రథోత్సవంలో ఏలూరుకు చెందిన కళాకారులు కాళికాశక్తి, భద్రకాళి, బుట్టబొమ్మలు, తదిర వేషాధారణ, గాజులపల్లె బృందం వారి చెక్క భజన కార్యక్రమాలు అలరించాయి. మైదుకూరుకు చెందిన మహిళల కోలాటం, ఉమామహేశ్వర ఈవెంట్స్ వారి బృందావనం, కాంతార, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్, ఎస్ఐలు మల్లికార్జునరెడ్డి, భూపాలుడు, రమణయ్య, వరప్రసాదరావు, సత్యనారాయణ, తమ సిబ్బందితో గట్టి బందోబస్తు చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మైలతేరు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

పూజల్లో పాల్గొన్న మంత్రి, నేతలు

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బీవీ ప్రసాదరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి, సహకార సంఘం మాజీ అధ్యక్షుడు గువ్వల సుబ్బారెడ్డి, పెనుగొండ శేఖర్, మురళీ, తదితరులు పూజలు నిర్వహించారు. అనంతరం రథాన్ని లాగి ప్రారంభించారు. అంతకముందు ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, తదితరులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా సప్తాహం


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి

బేతంచెర్ల: స్థానిక గొరిపేటలోని పూదోట ఆశ్రమంలో హనుమాన్ జయంతి పురస్కరించుకొని లోక కళ్యాణార్థం భక్తులు హనుమాన్ చాలీసా సప్తాహం గురువారం ప్రారంభించారు. ఉదయం అర్చకులు ప్రభాకర్ శర్మ, ఆశ్రమ నిర్వాహకుల ఆధ్వర్యంలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలను కొలువుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఖమ్మం జిల్లాకు చెందిన శ్రీ సర్వ లక్ష్మి బృందం వారిచే హనుమాన్ చాలీసా సంకీర్తన ప్రారంభించారు. ఈ నెల 21వ తేదీ వరకు హనుమాన్ చాలీసా సప్తాహం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

వాట్సప్ ద్వారా 250 రకాల సేవలు

బేతంచెర్ల: నగర పంచాయతీ పరిధిలోని గ్రామ సచివాలయాల్లో వాట్సాప్ ద్వారా ప్రభుత్వం 250 రకాల సేవలను ప్రజలకు అందిస్తోందని నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు. మన మిత్ర వాట్సాప్ క్యూ ఆర్ స్కానర్ డిస్‌ప్లే చేయడం జరిగిందని, వీటి ద్వారా ఇంటిపన్ను చెల్లింపులు తదితర సేవలను సురక్షితంగా చేసి డిజిటల్ కాపీ లేదా రసీదును పొందవచ్చన్నారు. 95523 00009 నంబర్‌కు వాట్సాప్‌లో హాయ్ అని పంపడం ద్వారా సేవలను పొందవచ్చన్నారు.

రహదారిని బాగు చేయండి


దెబ్బతిన్న రహదారిని చూపుతున్న సీపీఎం నాయకులు

బేతంచెర్ల: పట్టణంలోని భారత్ బేకరి సందులో ఉన్న వీధి రహదారికి నగర పంచాయతీ అధికారులు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, సంజీవనాయుడు డిమాండు చేశారు. గతంలో పైప్‌లైన్ వేసేందుకు రహదారిని తవ్వారని, అనంతరం నామమాత్రంగా మరమ్మతు పనులు చేపట్టడంతో రహదారి దెబ్బతిని గుంతల మయంగా మారిందన్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నగర పంచాయతీ అధికారులు పూర్తిస్థాయిలో మరమ్మతు పనులు చేపట్టడంతో పాటు దెబ్బతిన్న డ్రైనేజీ కాల్వ పనులు చేపట్టాలని కోరారు.

ముగిసిన బైబిల్ శిక్షణ

డోన్: ఈనెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు చిన్నారులకు నిర్వహించిన విరామ బైబిల్ శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కొత్తబస్టాండ్ వద్ద గల ఏబీఎన్ చర్చి నుంచి పాతబస్టాండ్ వరకు రాయలసీమ వర్డ్ అండ్ ప్రేయర్ ఫెలోసిప్ వారి ఆధ్వర్యంలో చిన్నారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కిడ్స్ ఆఫ్ కింగ్‌డమ్ మినిస్ట్రీకి సంబంధించిన స్వప్న, సంధ్య, సౌమ్య పిల్లలకు చక్కటి పాటలు, కథలను నేర్పించారు. క్రిస్టియన్ జేఏసీ అధ్యక్షుడు ఆదాం, ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, పాస్టర్లు శాంతిరాజ్, ప్రభుదాస్, దేవదాస్, సోలోమోన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి

డోన్ టౌన్: విద్యతోనే భవిష్యత్ అభివృద్ధి బాటలో పయనిస్తుందని భారత్ గ్యాస్ డీలర్, విజయగ్యాస్ అధినేత రాజా విజయకుమార్, సుజాత దంపతులు అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటిన సిబ్బంది ఫిరోజ్ బాషా కూతురు కె.సమీయ, గౌస్‌బాషా కుమారుడు నజీర్, కుమార్ కుమారుడు రాకేష్‌ను అభినందిస్తూ బహుమతులు అందజేశారు. అలాగే సిబ్బందికి, డెలివరీ బాయ్స్‌కు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

నక్కి రామన్నకు నివాళి

డోన్ రూరల్: స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం కామ్రేడ్ నక్కిరామన్న 35వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై నక్కిరామన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ మండల కార్యదర్శి నారాయణ, మహిళా సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షురాలు నక్కిబాలమ్మ, నాయకులు పులిశేఖర్, హుసేన్ పీరా తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

ప్యాపిలి: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నట్లు రైతు సేవా కేంద్రం సిబ్బంది వినీత్, బాలు, సురేంద్ర తెలిపారు. మండల పరిధిలోని గుడిపాడు, పీఆర్ పల్లి, చంద్రపల్లి, జక్కసానికుంట్ల గ్రామాల్లో గురువారం కౌలురైతుల గుర్తింపు కోసం గ్రామసభ నిర్వహించారు. పంటలు సాగు చేసుకునేందుకు పొలాలను కౌలుకు తీసుకున్న రైతులు సంబంధిత అగ్రిమెంట్‌తో తమను సంప్రదించాలన్నారు. శుక్రవారం హుసేనాపురం, ఊటకొండ, జలదుర్గం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

భైరవుడి కాపలా..!

వరి ధాన్యపు రాశిపై కాపలాగా ఉన్న కుక్క


డోన్ రూరల్: మండల పరిధిలోని గుమ్మకొండ గ్రామంలో ఒక రైతు తన పొలంలో పండించిన వరి ధాన్యాన్ని కుప్పగా పోసి తన పెంపుడు కుక్కను కాపలాగా ఉంచాడు. ధాన్యం రాశిపై కుక్క కూర్చొని చుట్టూ చూస్తూ దొంగలు అటు వైపు రాకుండా కాపలాగా ఉండటం అందరినీ ఆకర్షించింది. దీన్ని చూసిన వారందరూ ఈ కుక్కకు విశ్వాసం ఎక్కువే అని చర్చించుకున్నారు.

జిల్లా సరిహద్దులో భారీగా ట్రాఫిక్ జామ్


రోడ్డుపై బోల్తాపడిన ట్రైలర్ లారీ


నిలిచిపోయిన వాహనాలు

కొలిమిగుండ్ల: బందార్లపల్లె క్రాస్ రోడ్డు సమీపంలోని జిల్లా సరిహద్దు వద్ద గురువారం భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కొలిమిగుండ్ల నుంచి తాడిపత్రి వైపుకు వెళ్తున్న ట్రైలర్ లారీ అదుపుతప్పి కింద పడింది. ఓవైపు కొండ భాగం, మరొక వైపు రైయిలింగ్ ఉండటంతో బైక్‌లు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో 544–డీ జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సులు, ట్రాన్స్‌పోర్టు తదితర వాహనాలు భారీగా నిలిచిపోయాయి. గంటకు పైగానే ట్రాఫిక్ సమస్య ఏర్పడటంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న సీఐ రమేష్‌బాబు సిబ్బందితో ప్రమాదస్థలానికి చేరుకున్నారు. ప్రొక్లెయినర్ తెప్పించి పక్కకు తీయించారు. దీంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం అయింది.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

బనగానపల్లె : బనగానపల్లె సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక సీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రధానంగా నాటుసారా అమ్మకాన్ని నిర్మూలించడం ఎంతో అవసరమన్నారు. వీటి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. పట్టుబడిన వారి ప్రవర్తనను బట్టి రౌడీషీట్లను కూడా ఓపెన్ చేస్తున్నట్లు వెల్లడించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కూడా రౌడీషీట్ ఓపెన్ చేస్తున్నట్లు తెలిపారు. బనగానపల్లె పట్టణంతో పాటు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. దద్దణాల ప్రాజెక్టు సమీపంలో గతంలో తరచు ప్రమాదాలు జరిగేవన్నారు. పోలీసులు తీసుకున్న చర్యల వల్ల ఇక్కడ ప్రమాదాలను నివరించినట్లు తెలిపారు. ట్రాఫిక్ సమస్య నిర్మూలనకు సీఐ ప్రవీణ్‌కుమార్ తీసుకుంటున్న చర్యలను డీఎస్పీ కొనియాడారు. సమావేశంలో సీఐలు మంజునాథ్ రెడ్డి ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ దుగ్గిరెడ్డి పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

డోన్ టౌన్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొని మద్దతు తెలపాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి ఏఈ నాగరాజు కోరారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి ప్రాణాలు పణంగా పెట్టి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో 4 లేబర్ కోడ్‌లను తెచ్చేలా కేంద్రం యత్నిస్తోందని, దీన్ని వ్యతిరేకిస్తూ జేఏసీ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపునకు ప్రతిఒక్కరు స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్యాపిలి, బేతంచెర్ల బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్లు చిన్న మద్దయ్య, రవికుమార్, డోన్ తాలూకా కన్వీనర్ మనోజ్‌కుమార్, మండల కన్వీనర్ విజయుడు తదితరులు ఉన్నారు.

యూపీహెచ్‌సీలో ఆక్రమణలు తొలగించండి


అర్బన్ హెల్త్ సెంటర్ ఎదురుగా ఆక్రమణలు, ఆటో స్టాండ్

డోన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ ఆక్రమణదారులు, వాహనదారుల వల్ల కనిపించకుండా పోతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొందరు టీడీపీ నాయకులు కూరగాయల మార్కెట్ ఆవరణతో పాటు అర్బన్ హెల్త్ సెంటర్ ఎదురుగా ఆక్రమణలను ప్రోత్సహించడంతో రోగులు, బంధువులతో పాటు మార్కెట్‌కు వచ్చే ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. ప్రధాన రహదారికి గేటు లేకపోవడంతో అర్బన్ హెల్త్ సెంటర్ ఎదురుగానే బంకులు, టీస్టాల్‌లను ఏర్పాటుచేశారు. దీంతో రోగులతో పాటు బంధువులకు సేదతీరేందుకు కూడా స్థలం లేకుండా పోయింది. మున్సిపల్ అధికారులు ఇకనైనా స్పందించి అర్బన్ హెల్త్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించి ప్రధాన గేటును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం


విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ ఇస్తున్న దృశ్యం

బేతంచెర్ల: విద్యార్థులు వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయాలను సందర్శించి, విజ్ఞానం పెంచుకోవాలని గ్రంథాలయ అధికారి మధు సుధాకర్ సూచించారు. గురువారం పట్టణంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖం, ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇచ్చారు. క్యారమ్స్, చెస్ ఆటలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయురాలు కృష్ణప్రియ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయరాదు


గ్రామసభలో మాట్లాడుతున్న సీఐ గౌతమి

బనగానపల్లె రూరల్ : బాల్యవివాహాలు చేయరాదని నంద్యాల సీఐ గౌతమి సూచించారు. గురువారం సాయంత్రం మండలంలోని చెర్లోకొత్తూరు గ్రామంలో పర్యటించి, గ్రామస్తులకు బాల్యవివాహాలు చేయడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను వివక్షలేకుండా పెంచాలన్నారు. బాలికలు టీవీ, సెల్ ఫోన్, ఫేస్‌బుక్ వంటి వాటికి దూరంగా ఉండాలని, చదువు పైనే దృష్టి ఉంచి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఏమైన సమస్యలు ఉంటే శక్తి యాప్‌లో తమ సమస్యలను తెలియజేయాలన్నారు. ఇంకా మైనర్ బాలికలపై జరిగే అఘాయిత్యాలు, చట్టాలపై విద్యార్థినులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణ

ప్యాపిలి: ఖరీఫ్ సమీపిస్తున్న నేపథ్యంలో మండల పరిధిలోని పలు గ్రామాల్లో మట్టి నమూనాలు సేకరిస్తున్నట్లు వ్యవసాయాధికారి రాజేశ్ గురువారం తెలిపారు. మండల వ్యాప్తంగా 1238 మట్టి నమూనాలు సేకరించాలని జిల్లా అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించినట్లు ఆయన తెలిపారు. గత రెండు రోజుల్లో 805 నమూనాలు సేకరించి భూసార పరీక్షా కేంద్రానికి పంపినట్లు తెలిపారు. మట్టి నమూనాల ఫలితాలను బట్టి రైతులు సాగు చేయాల్సిన పంటలను ఎంపిక చేసుకోవాలన్నారు.

నేడు రాతిదూలం లాగుడు పోటీలు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఉభయ రాష్ట్రాల స్థాయి వృషభాల రాతిదూలం లాగుడు పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో న్యూ కేటగిరి ఎడ్ల బలప్రదర్శన పోటీలను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. పోటీల్లో విజేతగా నిలిచిన వృషభాల యజమానికి మొదటి బహుమతిగారూ.1.10లక్షలు,ద్వితీయ రూ.90వేలు,తృతీయ బహుమతి రూ. 70 వేలు, తర్వాతి వరుస స్థానాల్లో రూ. 50 వేలు, రూ. 40 వేలు, రూ. 30 వేలు,రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు అందజేస్తారన్నారు. ఆసక్తిగల ఎద్దుల యజమానులు ఆలయ కమిటీని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

22న హనుమాన్ శోభాయాత్ర

కొలిమిగుండ్ల: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 22న కొలిమిగుండ్లలో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ జిల్లా సహకార ప్రచారక్ శ్రీనివాసులు గురువారం తెలిపారు. స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం నుంచి 200 బైక్‌లతో ఉన్నత పాఠశాల వరకు శోభాయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వీడని అకాల వర్షాలు


వర్షంతో జలమయమైన ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం

కోవెలకుంట్ల: వేసవికాలం స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో అకాల వర్షాలు రైతులను వీడటం లేదు. బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. సబ్ డివిజన్‌లోని దొర్నిపాడు మండలంలో 20.4 మి.మీ, కోవెలకుంట్ల మండలంలో 16.6 మి.మీ, అవుకు మండలంలో 15.2 మి.మీ, కొలిమిగుండ్ల మండలంలో 8.4 మి.మీ, సంజామల మండలంలో 1.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు తెలిపారు. వరుసగా కురుస్తున్న వర్షాలతో వాతావరణం చల్లబడి వేసవి నుంచి ఉపశమనం లభించినా రైతులకు నష్టం చేకూరుస్తున్నాయి. వర్షం కారణంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం జలమయం కావడంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన వరి, మిరప, పొగాకు పంటలను అకాల వర్షం దెబ్బతీసింది. కల్లాల్లో ఆరబోసుకున్న వడ్లు, మిరపకాయలు తడిచిపోకుండా కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

సంజామల: పండ్ల తోటలకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సాల్మన్ సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన సదస్సును అగ్రికల్చర్, హార్టీకల్చర్, ఫీల్డ్ అసిస్టెంట్లతో కలిసి నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లడుతూ.. రైతులు ఒకే రకమైన పంటలు వేయడం ద్వారా నష్టపోయే అవకాశం ఉందన్నారు. రైతులు ఆదాయం మార్గంలో నడవాలంటే పండ్ల తోటలు మంచి మార్గం అన్నారు. పండ్లతోటలను నాటుకునే రైతులకు ప్రభుత్వం వంద శాతం సబ్సిడీ అందిస్తుందన్నారు. 14 రకాల పండ్ల తోటలకు అవకాశం ఉందని చెప్పారు. ఆసక్తి కలిగిన రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ సుధాకర్ రెడ్డి, ఏపీఓ జయంతి, ఉద్యాన శాఖ అధికారి రఘువరన్ తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి


రాజ్‌కుమార్(ఫైల్)

కోవెలకుంట్ల: మండలంలోని చిన్నకొప్పెర్లలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి గురువారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు. గ్రామానికి చెందిన రాజ్‌కుమార్(29) కొన్ని నెలల నుంచి వెన్నుముక నొప్పితో బాధపడుతున్నాడు. ఆపరేషన్ చేయించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది మూడు రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతునికి భార్య శిరీష, ఐదేళ్ల కుమారుడు రిత్విక్‌కుమార్, ఆరు నెలల కుమార్తె ఆద్వి ఉన్నారు. రేవనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనుల పండువగా రథోత్సవం


ఘనంగా భూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి రథోత్సవం

అవుకు: పట్టణంలో శ్రీ భూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం కనుల పండువగా జరిగింది. ఉదయం స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు పూజకార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను నూతనంగా తయారు చేసిన రథంపై కొలువు తీర్చారు. మేళతాలతో రథోత్సవాన్ని ప్రారంభించారు. తేరు వీధి నుంచి రథోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో వైస్సార్‌సీపీ నేత చల్లా విగ్నేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కేరళ వాయిద్యాలు ప్రత్యేకంగా ఆకర్షించాయి.

